

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

## ఎన్నికల హామీలను నెరవేరుస్తాం

**భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు**

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 25 : ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలోని నాగారం, అజాంనగర్, నందిగామ, పంబాపూర్, దీక్షకుంట, దూదేకులపల్లి, గొల్లబుద్దారం, రాంపూర్, కమలాపూర్, కొంపెల్లి, గొర్లవేడు, వజినేపల్లిలో రూ. 1.65 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం అజాంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.13.50 లక్షల నిధులతో నిర్మించనున్న సైన్స్ ల్యాబ్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే కొన్ని హామీలను అమలు పరిచిందన్నారు. గృహజ్యోతి, వంటగ్యాస్ పథకాల అమలుకు త్వరలో నిర్ణయం తీసుకుంటామని, ఇండ్లు లేని ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షలు అందజేస్తామని తెలిపారు. అన్ని గ్రామాల అభివృద్ధే ప్రభుత్వం ధ్యేయమని, డ్వాక్రా మహిళలకు అందజేసిన కుట్టుమిషన్లతో ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవాదాయ శాఖ అధికార్లు

## పూరేడు గుట్ట జాతర ఆదాయం రూ. 4.17లక్షలు

చిట్యాల, ఫిబ్రవరి 25 : మండలంలోని వెంచరామి గ్రామ శివారు పూరేడు గుట్ట మినీ మేడారం జాతర హుండీ ఆదాయం రూ 4.17 లక్షలు వచ్చినట్లు దేవాదాయ శాఖ ఈవో నాగేశ్వర్‌రావు తెలిపారు. ఆదివారం వెంచరామి ప్రాథమిక పాఠశాలలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో హుండీలను లెక్కించారు. జాతరకు సుమారు 2 లక్షల మంది భక్తులు తరలివచ్చినట్లు ఈవో తెలిపారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మల్లారపు మొగిలి, వైస్ చైర్మన్ గుర్రం రజితారాజేందర్, దేవాదాయ శాఖ సిబ్బంది మధూకర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గూట్ల తిరుపతి, మూల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి టబ్‌లో పడి యువకుడి మృతి

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 25 : మండలంలోని కొర్కిశాల శివారు బద్దంపల్లె గ్రామానికి చెందిన సామల ప్రశాంత్ (25) అనే యువకుడు ఆదివారం ప్రమాదవశాత్తు నీటి టబ్‌లో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం ప్రశాంత్ గత కొన్నేళ్లుగా నరాల బలహీనతతో బాధ పడుతున్నాడు. దీంతో కాళ్లు, చేతులు సరిగా పని చేయడం లేదు. కాగా ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో నల్లా నీళ్ళు పట్టేందుకు టబ్ వద్దకు వెళ్లి నోటితో పైప్ జరుపుతున్న క్రమంలో టబ్‌లో పడి శ్వాస ఆడక మృతి చెందాడు. గమనించిన చుట్టు పక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి బయటకు తీశారు. మృతుడి తల్లి వనమాల పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై మాధవ్ ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

## 29న సేవాలాల్ జయంతి వేడుకలు

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 25 : భూపాలపల్లి పట్టణంలోని భారత్ ఫంక్షన్ హాలులో ఈ నెల 29న శ్రీ సంత్ సేవాలాల్ 285 వ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ కో కన్వీనర్ అజ్మీరా తిరుపతినాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★Wanted PRO's for Degree and Junior College Admissions (20 years Experience) Cont: 8121554649, 9391660036.
NTW-323172

★Urgent Requirement for ICIC, HDFC, AXIS, INDUSIND Bank's Loans. Need Exp. & Fresher Female Tele-Callers, Sal+Inc. etc., Job Location: HNK, Cont: +91 8712312528.
NTW-5693

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319443

★హైదరాబాద్‌లో అర్జెంటుగా కొండాపూర్‌కి సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం, భోజనం, వసతి కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-313897

FINANCIAL SERVICES

★రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార రుణం, అతి తక్కువ వడ్డీ రేటుతో, సిబిల్ అవసరం లేదు! NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను. నొవా ఫైనాన్స్. ఫోన్: 7696660523.
NT-311956

PLOT FOR SALE



★2 ఎకరాల 23 గుంటల వ్యవసాయ భూమి అమ్మకానికి కలదు. రామప్ప గుడికి 1.5 kms సమీపంలో, వెంకటాపూర్, ములుగు (D), వరంగల్. సంప్ర: 8686589800.
NTW-323173

★హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ, బాటసింగారం, శ్రీమిత్ర, జనచైతన్య, మౌంట్ ఒపేర, గ్రీన్ సిటీ, సుచిరిండియాలో ప్లాట్లు కొనబడును. నో Brokrs. 9553973999 / 6303049720.
NT-313892

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

★సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-323107

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం: 9182777552

| HANAMKONDA | WARANAGAL |
|---|---|
| 9182777563 | 9182777556 |
| 9182777618 | 9182777557 |

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

# ప్రజా తీర్పును గౌరవిద్దాం

- **ప్రజల పక్షాన పోరాటం చేద్దాం**
- **భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి**

టేకుమట్ల, ఫిబ్రవరి 25 : ప్రజలిచ్చిన తీర్పును గౌరవించి, కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం చేద్దామని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గెలుపునకు పొంగిపోయి, ఓటమికి కుంగిపోవడం తన స్వభావం కాదని, నాయకులు, కార్యకర్తలు కూడా అధైర్య పడకుండా ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజా వ్యతిరేక కార్యకలాపాలపై పోరాటం చేయాలన్నారు. అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలు 100 రోజుల్లో నెరవేర్చని పక్షంలో పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి అధిక మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తేనే ప్రభుత్వం ఇచ్చిన హామీలను బాధ్యతగా నేరువేరుస్తుందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులనే ఎమ్మెల్యే ప్రారంభిస్తున్నారని, కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని, ఇప్పుడు జరుగుతున్న కాలయాపనను ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతు బంధు రాక, రుణమాఫీ కాక, చెరువులు, వాగులు ఎండిపోయి, పంటలు చేతికి వస్తాయో రావో తెలియని ఆందోళనలో రైతులున్నారని గండ్ర అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రవి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

## రామప్పలో సండే సందడి

వెంకటాపూర్, ఫిబ్రవరి 25 : మండలంలోని రామప్ప దేవాలయం ఆదివారం పర్యాటకులు, విద్యార్థులు, భక్తులతో సందడిగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి 10 వేల మంది పర్యాటకులు, మేడారం భక్తులు, పలువురు అధికారులు, సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం రామప్ప సరస్సులో బోటింగ్ చేసి ఆహ్లాదంగా గడిపారు.

**సందర్శించిన రాష్ట్ర హైకోర్టు జడ్జి రాజేశ్వర్‌రావు**

ఆదివారం హైకోర్టు జడ్జి నామవరపు రాజేశ్వర్‌రావుకు రామప్ప అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వారిని శాలువాలతో సన్మానించి, ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ప్రాముఖ్యతను టూరిజం గైడ్ ద్వారా తెలుసుకొని మాట్లాడుతూ శిల్పకళ అద్భుతంగా ఉందని కొనియాడారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట జడ్జిలు నారాయణబాబు, లలితా శివజ్యోతి, మాధవి, సౌఖ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాలచారి, న్యాయవాదులు వినయ్‌కుమార్, రవీందర్, స్వామిదాస్, తహసీల్దార్ వీరభద్రారావు, ఎస్సై చల్ల రాజు, ఇతర అధికారులు ఉన్నారు.



రామప్ప ఆలయంలో హైకోర్టు జడ్జి రాజేశ్వర్‌రావుతో జడ్జిలు, అధికారులు

## మల్లూరు ఆలయంలో ఎమ్మెల్సీ సారయ్య పూజలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ దంపతులు

మంగపేట, ఫిబ్రవరి 25 : మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో ఆదివారం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన ఆయన ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చక బృందం, చైర్మన్ నూతిలకంటి ముకుందం స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో నిర్వహించిన తైలాభిషేక పూజాక్రతవులో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారికి ఆశీర్వచనంతో పాటు తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యుడు శ్రీనివాసాచారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మండల పరిషత్‌లో ప్రత్యేక సమావేశం

మహదేవపూర్, ఫిబ్రవరి 25 : మండలంలో నీటి ఎద్దడి నివారణపై మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీలో వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బన్సోడ రాణీబాయి అధ్యక్షతన ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, ప్రభుత్వ శాఖల అధికారులు తప్పసరిగా హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

# ప్రశాంతంగా టెక్నికల్ సర్టిఫికెట్ పరీక్షలు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 25 : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్ రాంకుమార్, పరీక్షల నియంత్రణ అధికారి మందల రవీందర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా డ్రాయింగ్ లోయర్ పరీక్షకు 150 మంది దరఖాస్తు చేసుకోగా 99 మంది, హయ్యర్‌లో 20 మందికి 18 మంది, టైలరింగ్, ఎంబ్రాయిడరీ హయ్యర్ పరీక్షకు 20 మందికి 18, లోయర్‌కు 22 మందికి 12 మంది హాజరైనట్లు వారు పేర్కొన్నారు. చీఫ్ సూపరింటెంటెంట్‌గా నెల్లుట్ల లక్ష్మీప్రసన్న, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా బానోత్ సేవానాయక్, సిట్టింగ్ స్క్వాడ్స్‌గా బదావత్ బాలకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్, సహాయకుడిగా కుసుమ కృష్ణమోహన్ విధులు నిర్వర్తించారని వారు తెలిపారు.



టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు







తాడ్వాయి : మేడారం జాతర ముగియడంతో భక్తులు వెనుదిరుగుతున్నారు. మేడారం పరిసరాలు క్రమేణా ఖాళీ అవుతుండగా అమ్మవారి గద్దెల వద్ద మాత్రం రద్దీ కొనసాగుతూనే ఉంది..

## ఐనవోలు మల్లన్న ఆలయంలో భక్తుల సందడి



స్వామివారిని రథంపై ఊరేగిస్తున్న భక్తులు

ఐనవోలు, ఫిబ్రవరి 25: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం భక్తులతో సందడిగా మారింది. ఆదివారం వారంతపు జాతరకు భక్తులు వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. శనివారం నుంచే భక్తులు వచ్చి ఆలయ ప్రాంగణంలో విడిది చేయగా జాతర ప్రాంగణం కిటకిటలాడింది. ఒగ్గు పూజారులు స్వామివారికి మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు, కల్యాణం నిర్వహించి, రుద్రాభిషేకాలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో విడిది చేసి పట్నాలు వేసి బోనం వండి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఒగ్గు పూజారులు నజర్, చిల్క పట్నాలు వేసి పూర్వీకులను స్తుతించారు. ఆపదల నుంచి గట్టెక్కించి కోర్కెలు తీర్చాలని కోరుకుంటూ వరాలు పట్టి వేడుకున్నారు. అమ్మవార్లకు భక్తులు ఒడిబియ్యం, వస్త్రాలు, ముత్తైదు సామగ్రిని ముట్టజెప్పారు. మరికొందరు స్వామివారికి రథసేవ చేశారు. జాతరలో స్వామివారికి అభిషేకాలు, కల్యాణ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మాతృభాషను కాపాడుకోవాలి

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 25: మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆచార్య బన్న ఐలయ్య అన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని బీఈడీ కళాశాల ఆడిటోరియంలో ఉదయ సాహితీ సాహిత్య వికాస వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచ వ్యాప్తంగా అనేక భాషలు అంతరించిపోతున్నాయని, భాష అంతరిస్తే జాతి కూడా అంతరించినట్లేనని అన్నారు. ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై తెలుగుభాషను పరి రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఉదయ సాహితీ వరంగల్ జిల్లా శాఖ అధ్యక్షురాలు వకుళవాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీలేఖ సాహితీ అధ్యక్షుడు డాక్టర్ టి.శ్రీరంగస్వామి, తెలంగాణ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి బిల్ల మహేందర్, ఉదయ సాహితీ రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం లక్ష్మయ్య, గౌరవాధ్యక్షుడు ఏడెల్లి రాములు, నగునూరి రాజన్న, వకుళాభరణం శివరంజని, మెరుగు అనురాధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కవితల పోటీ విజేతలకు బహుమతులను ప్రదానం చేసి, వారిని సన్మానం చేశారు.



రఘుబాబు విగ్రహావిష్కరణలో పాల్గొన్న గ్రామస్తులు, నాయకులు

## 'రఘుబాబు సేవలు మరువలేనివి'

గోవిందరావుపేట, ఫిబ్రవరి 25 : వైస్ ఎంపీపీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఎడ్లపల్లి రఘుబాబు ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని ఆ పార్టీ సీనియర్ నాయకుడు పైడాకుల కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని దుంపిల్లగూడెంలో రఘుబాబు 10వ వర్ధంతిని పురస్కరించుకుని గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని కృష్ణమూర్తి ఆవిష్కరించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్‌యాదవ్, వేల్పుగొండ పూర్ణచందర్, నాగమణి, జయమ్మతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



జనాలు లేక నిర్మాణుష్యంగా ఉన్న భూపాలపల్లిలోని అంబేద్కర్ సెంటర్

## తగ్గిన జాతర వాహనాల రద్దీ

**ప్రశాంతంగా మారిన భూపాలపల్లి**

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 25 : మేడారం జాతర వాహనాల రద్దీ తగ్గడంతో భూపాలపల్లి జిల్లా కేంద్రం నిర్మానుష్యంగా మారింది. జాతర సందర్భంగా తల్లులను దర్శించుకొని తిరుగు ప్రయాణమయ్యే భక్తులకు వారం రోజులుగా కమలాపూర్ నుంచి వన్ వే ఏర్పాటు చేశారు. దీంతో వాహనాలు కమలాపూర్ నుంచి జిల్లా కేంద్రం నుంచి వెళ్లడంతో మంజూర్ నగర్ వరకు రోడ్డు రద్దీగా మారిపోయింది. ఎక్కడ చూసినా మేడారానికి వెళ్లి వస్తున్న వాహనాలు కనిపించేవి. గణేశ్ చౌక్ నుంచి జయశంకర్ సెంటర్ వరకు, అంబేద్కర్ సెంటర్‌లో రోడ్డుకిరువైపులా వాహనాలు నిలుపుకొని అక్కడి హోటళ్లలో భోజనాలు చేసేవారు. దీంతో జిల్లా కేంద్రం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. మేడారం జాతర ముగియగా ఆదివారం వాహనాల రద్దీలేక ప్రధాన రహదారి వెలవెలబోయింది.

## జర్నలిస్ట్ శంకర్‌పై దాడి హేయం

**ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిరంజీవి**

కాటారం, ఫిబ్రవరి 25 : సీనియర్ జర్నలిస్ట్ శంకర్‌పై కొంతమంది దుండగులు దాడి చేయడం హేయమైన చర్య అని కాటారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంతెన చిరంజీవి అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ సమాజ అభ్యున్నతికి ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న జర్నలిస్టుల పాత్ర అనిర్వచనీయమని, వారిపై దాడులు చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతున్న శంకర్‌పై దాడి చేసిన దుండగులు ఎంతటివారైనా అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## జంపన్నవాగులో భక్తుడి మృతి

తాడ్వాయి, ఫిబ్రవరి 25 : వనదేవతల దర్శనానికి వచ్చిన భక్తుడు జంపన్నవాగులోకి దిగి గల్లంతై మృతి చెందాడు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మలక్‌పేటకు చెందిన రోహిత్‌లాల్ (21) కుటుంబంతో కలిసి శనివారం అమ్మవార్ల దర్శనానికి వచ్చాడు. తన బావమరిది యశ్వంత్‌తో కలిసి చిలకలగుట్ట వెనుక భాగాన సుమారు 5 కిలోమీటర్ల దూరంలోని మాటేరు తోగె వద్ద స్నానం చేసేందుకు వాగులోకి దిగాడు. లోతు ఎక్కువగా ఉండడంతో రోహిత్‌లాల్ నీళ్లలో మునిగిపోయాడు. వెంటనే యశ్వంత్ కుటుంబ సభ్యులకు సమాచారమందించగా వారు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డికి తెలిపారు. రాత్రి కావడంతో వెళ్లలేకపోయిన పోలీసులు ఆదివారం ఉదయం ఘటనా స్థలికి వెళ్లి రోహిత్‌లాల్ మృతదేహాన్ని గుర్తించారు. అక్కడి నుంచి ఎస్సైతో పాటు సిబ్బంది మృతదేహాన్ని మోసుకుని వచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



వాగులో నుంచి రోహిత్‌లాల్ మృతదేహాన్ని తీసుకొస్తున్న పోలీసులు

## డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

మల్హర్, ఫిబ్రవరి 25 : మండలంలోని కొయ్యూర్ నుంచి ఎడ్లపల్లి, రుద్రారం, కాటారం మీదుగా బస్వాపూర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఎంపీపీ మల్హర్‌రావు తెలిపారు. 13 కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు రూ. 20 కోట్లు మంజురు చేసిన మంత్రి శ్రీధర్‌బాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీనివాస్‌రెడ్డి నియామకంపై హర్షం

కృష్ణకాలనీ/కాటారం, ఫిబ్రవరి 25 : మీడియా అకాడమీ చైర్మన్‌గా కే శ్రీనివాస్‌రెడ్డిని నిమించడంపై ఐజేయూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు క్యాతం సతీశ్‌కుమార్, సామంతుల శ్యామ్‌యాదవ్, కోశాధికారి చింతల కుమార్‌యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కాటారం ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు గైని రమేశ్, మండల జర్నలిస్టులు హర్షం ప్రకటించారు.

## అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ

గణపురం, ఫిబ్రవరి 25 : హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో మండల కేంద్రంలోని శ్రీ నారాయణ హైస్కూల్ విద్యార్థులు మన్వీత్‌చందర్, యోగ శ్రీ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఆవరణలో కరస్పాండెంట్ భానుచందర్, ప్రిన్సిపాల్ ఏ స్రవంతి, డైరెక్టర్ రవి, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు



అశోక్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న గౌడ సంఘం నాయకులు

## గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 25 : కేసీఆర్ సేవాదళ్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బుర్ర అశోక్ గౌడ్ తల్లి ఇటీవలి మృతి చెందగా గౌడ సంఘాల జేఏసీ నాయకులు ఆదివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.15,016 ఆర్థిక సాయం అందజేశారు. అలాగే కాశింపల్లికి చెందిన గీతి కార్మికుడు పులి సంతోష్ గౌడ్ తాటి చెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలు కాగా ఆయనను పరామర్శించి రూ. 5, 016 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ బుర్ర రమేశ్ గౌడ్ మాట్లాడుతూ సంతోష్ కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయంతో పాటు గీత కార్మికులకు సేఫ్టీ మోకులు ప్రభుత్వం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బుర్ర కుమారస్వామి, పులి వేణుగోపాల్, సమ్మయ్య, బుర్ర రాజు, బుర్ర అనిల్, గుర్రం సతీశ్, బుర్ర రాజయ్య, మాచర్ల నర్సయ్య, బుర్ర వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ ట్యాంకర్ బోల్తా

వాజేడు, ఫిబ్రవరి 25 : మండలంలోని కృష్ణాపురం, కడెకల్ గ్రామాల మధ్య ఛత్తీస్‌గఢ్ నుంచి వాజేడు వైపు వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఆదివారం ఉదయం అదుపుతప్పి రహదారి పక్కన బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.



కృష్ణాపురం గ్రామ శివారులో బోల్తాపడిన ఆయిల్ ట్యాంకర్